నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | డిసెంబర్ 23, 2024 | www.navatelangana.com

కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-రెంజల్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తప్పుకోవాలని కోరుతూ మాల మహానాడు నాయకులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆయన దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఉమ్మడి జిల్లాల మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి మాట్లాడుతూ.. యావత్ భారతదేశ ప్రజలకు కేంద్ర హోంమంత్రి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనియెడల దళితుల నుంచి భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు డైరీ సాయిలు, గౌరవ అధ్యక్షులు బొడిగ రవి, మండల ఉపాధ్యక్షులు దేవరాజు, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు, గైని ఆనంద్, పోతురాజు ప్రభాకర్, జక్కుల అబ్బయ్య, పోతరాజు మదన్, లోక గంగాధర్, రాజశేఖర్, ప్రసాద్, బ్యాగరి గంగాధర్, పెద్ద సాయిలు, మహేందర్, శివకుమార్, రమేష్, నారాయణ, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-రెంజల్



పట్టుకున్న ఇసుక టిప్పర్

అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించినట్లు ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 21న సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా అటువైపుగా వస్తున్న ఇసుక టిప్పర్‌ను తనిఖీ చేయగా.. వారి వద్ద ఇసుక తరలింపునకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో దానిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తదుపరి చర్యల కోసం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

'వైద్యసేవల్లో నిర్లక్ష్యం' అనే ఫిర్యాదులు రావొద్దు



సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు

- వైద్యులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి
- నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- పీహెచ్‌సీ, ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లకు ప్రారంభోత్సవాలు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి దామోదర రాజనర్సింహ వైద్యాధికారులకు హితవు పలికారు. 'వైద్య సేవల్లో నిర్లక్ష్యం' అనే ఫిర్యాదులు రాకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రూ.38.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎం.సీ.హెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభోత్స వాలు చేశారు. అందుబాటులోకి వచ్చిన నూతన వైద్య సేవలను పరిశీలించి, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు రూ.కోటి 56 లక్షల వ్యయంతో రెంజల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. నిజామాబాద్‌లోని జిల్లా జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రోగులను పలకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో వైద్య సేవల స్థితిగతులపై వివిధ విభాగాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో విభాగం వారీగా జీజీహెచ్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ఇంకనూ అవసరమైన సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది ఖాళీలు, వైద్య పరికరాల ఆవశ్యకత గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ మంత్రి దృష్టికి తెచ్చారు. సదుపాయాలను మెరుగుపరుస్తూ, ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సమీక్షలో పాల్గొన్న జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, శాసన సభ్యులు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, రాకేష్‌రెడ్డి తదితరులు కోరగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. జీజీహెచ్, ఎంసీహెచ్ ఆసుపత్రులలో బోరు మోటార్ల ఏర్పాటుకు అవసరమైన వ్యయాన్ని తన నియోజకవర్గ కొత్త నిధుల నుంచి మంజూరు చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సమీక్ష సందర్భంగా ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వైద్య సేవల విషయంలో నిజామాబాద్ జిల్లాకు ఇదివరకు ఎంతో మంచి పేరు ఉండేదని, ప్రస్తుతం కూడా వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ పూర్వ ప్రతిష్ఠను పునరుద్ధరింపజేయాలని సూచించారు. ప్రభుత్వపరంగా ఎన్ని సదుపాయాలు కల్పించినా, వైద్య సేవల్లో లోపాలు ఉంటే ప్రయోజనం శూన్యంగా మారుతుందన్నారు. పేదలకు మెరుగైన సేవలు అందించడమే పరమావధిగా ప్రతి ఒక్కరు సేవా తత్పరతతో విధులు నిర్వర్తిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని హితవు పలికారు. ప్రభుత్వ వైద్యులు విధులకు ఎగనామం పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లు, ప్రైవేట్ ప్రాక్టీస్‌లకు పరిమితమైతే సహించే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో నిర్వహణపరమైన లోపాలను సరిదిద్దుకుని, వచ్చే ఉగాది నాటికి వంద రోజుల్లోపు పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా అంకితభావంతో పని చేయాలని సూచించారు. సబ్ సెంటర్ మొదలుకుని జిల్లా ఆసుపత్రులు, జీజీహెచ్ హాస్పిటల్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు తక్షణమే సమకూరుస్తామని, వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేసి అధునాతన వైద్య పరికరాలను మంజూరు చేస్తామని అన్నారు. ఆయా ప్రాంత ప్రజల అవసరాలు, దూర భారం తదితర అంశాలను బట్టి రాష్ట్రంలో ఎన్ని ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా వైద్యులు, సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తిస్తే సర్కారీ దవాఖానాల పట్ల ప్రజల్లో భరోసా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల వారు హైదరాబాద్‌కు వెళ్లేందుకు దూరభారమైనందున మధ్యస్థంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యారోగ్య శాఖ పనితీరులో మార్పు రావాలని, నిజామాబాద్ జిల్లాను వైద్య సేవల హబ్‌గా తీర్చిదిద్దాలని మంత్రి ఉద్బోధించారు. మందుల కొరత, వైద్య సేవలలో నిర్లక్ష్యం అనే ఫిర్యాదులు లేకుండా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాకు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్, ట్రామా కేర్ యూనిట్, కాన్సర్ చికిత్స కేంద్రాన్ని వచ్చే మూడు, నాలుగు నెలల వ్యవధిలోనే మంజూరు చేసేందుకు చొరవ చూపుతానని తెలిపారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, డీఎంఈ డాక్టర్ వాణి, అదనపు కలెక్టర్ అంకిత్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు..

హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌ను జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు.

జీజీహెచ్ అధికారులపై మంత్రి మండిపాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అధికారిపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మండిపడ్డారు. జిల్లా జనరల్ ఆసుపత్రిని సందర్శించి వివిధ విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అడుగుపెట్టిన క్షణం నుంచే 'భవనానికి మొక్కలు వస్తున్నాయి.. భవనానికి మొక్కలు పెరిగేంతవరకు చూస్తూ ఊరుకుంటారా..? అని మండిపడ్డారు. అనంతరం నిర్వహించిన రివ్యూ మీటింగ్ హాల్లో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అధికారికి ప్రభుత్వానికి చూపడానికే అన్ని రికార్డులు సృష్టించడంలోనే కాకుండా, దానికి సరైన విధంగా వైద్య సౌకర్యం, చికిత్స అందించే విధంగా ఉండి ముందుకు సాగాలని, ఆసుపత్రిలో మెయింటెనెన్స్ సక్రమంగా లేదని, అందుకు ముఖ్యంగా సమావేశం గదిలోనే ఏసీ పనిచేయట్లేదనేదే ఒక నిదర్శనమన్నారు. అదేవిధంగా మెయింటెనెన్స్ సరిగా ఉండి ఉంటే ఇటువంటి సమస్యలు ఏర్పడవని పునరావృతం కావద్దని హెచ్చరించారు. ఆసుపత్రికి కావలసినంత బడ్జెట్‌ను కేటాయిస్తామని, 100 రోజులలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా ఉండాలని అన్నారు. రికార్డులు చూపించడంలో జరిగిన తప్పిదాలను కూడా విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని హెచ్చరించారు.

మెరుగైన విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయం

నవతెలంగాణ-రెంజల్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందుబాటులోకి తెస్తూ సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. రెంజల్ మండల కేంద్రంలో రూ.కోటి 56 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య, వైద్యం, సామాజిక భద్రతను ప్రజలకు కల్పించాలనే ప్రధాన లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గ నిర్దేశంలో ముందుకెళ్తున్నామని అన్నారు. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాల అవసరాలను బట్టి ఆరోగ్య ఉప కేంద్రాలు, పీహెచ్సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులను ఏర్పాటు చేస్తూ, పీ.హెచ్.సీలను సీహెచ్ సీలుగా అప్ గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయాలలో అన్ని ప్రాంతాల ప్రజలకు ప్రాథమిక చికిత్స అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో తమ ప్రభుత్వం ఇటీవలే 213 నూతన అంబులెన్స్‌లను ప్రజలకు అంకితం చేసిందని గుర్తు చేశారు. ఇంకనూ మరో 85 వరకు అంబులెన్స్‌లను అందుబాటులోకి తెస్తామని వివరించారు. 102 అమ్మఒడి వాహనాలు కూడా ఆయా ప్రాంతాలకు సమకూరుస్తామని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన క్షతగాత్రుల ప్రాణాలను కాపాడేందుకు వీలుగా జాతీయ రహదారులపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని, వాటికి అంబులెన్స్‌లను అనుసంధానం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, శాసనసభ్యులు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి బడ్జెట్ పెంచాలి

- టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



విద్యా రంగానికి బడ్జెట్ పెంచాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) నిజామాబాద్ జిల్లా 6వ మహాసభను స్థానిక మల్లు స్వరాజ్యం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రతి యేటా ఒక్కో శాతం బడ్జెట్‌ను తగ్గిస్తూ తొమ్మిది సంవత్సరాల్లో 14 శాతం నుంచి 6 శాతానికి తీసుకొచ్చిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం విద్యా రంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిందని, కానీ బడ్జెట్‌లో కేవలం 7 శాతం మాత్రమే కేటాయించడం సరికాదని అన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని చేసిన విధ్వంసాన్ని సరిచేయాలంటే తక్షణమే నిధులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న పర్యటనలను మరింత వేగవంతం చేయాలని, తల్లిదండ్రుల నుంచి, సమాజంలోని మేధావి వర్గం, ఉపాధ్యాయుల నుంచి తగిన సూచనలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భాన్ని తల్లిదండ్రులు, మేధావులు ఉపయోగించుకుని విద్యా రంగం అభివృద్ధి కోసం విద్యా కమిషన్‌కు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. అదేవిధంగా 317 జి.ఓతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ తమ సొంత జిల్లాలకు పంపించాలని, ఉద్యోగుల పట్ల మరణ శాసనంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రి ప్రైమరీ తరగతులను ప్రారంభించి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడిని కేటాయించాలని, పండిట్, పి.ఈ.టి. అప్గ్రేడేషన్‌కి ముందున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల ప్రమోషన్ల కోసం ఎస్‌జిటిలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలను ప్రకటించాలని, పిఆర్‌సి రిపోర్టును వెంటనే తెప్పించుకోవాలని, ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉండి మూలుగుతున్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఎస్ఎస్ఏ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, రెసిడెన్షియల్ స్కూల్ టైమింగ్స్ సాధారణ పాఠశాలల మాదిరి మార్చాలని, రెసిడెన్షియల్, కేజీబీవీ, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీ, హాలిడే డ్యూటీ నుంచి మినహాయించాలని, ఎయిడెడ్ టీచర్స్‌కు ప్రతి నెల వేతనాలు అందించాలని, మోడల్ స్కూల్ టీచర్స్‌కు ప్రమోషన్ల ప్రక్రియ ప్రారంభించాలని, ఎయిడెడ్, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, కేజీబీవీ, యుఆర్ఎస్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను ప్రమోషన్లతో భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.సత్యానంద్, జిల్లా అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి జి.గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్, జిల్లా కోశాధికారి ఎన్.రాజారాం, జిల్లా కార్యదర్శులు జనార్ధన్, సాయన్న, ఆనందం, బాబులు, రాజు, గంగాధర్, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు రాజేశ్వర్, ప్రభాకర్, రఘు లింగన్న, శ్యామ్‌రావ్, రవీందర్, శంకర్‌తో పాటు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఆఫీస్ బేరర్స్ ఏకగ్రీవ ఎన్నిక

అనంతరం రాబోయే రెండు సంవత్సరాలకు జిల్లా ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఓ. రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి. గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం.మల్లేష్, బి.శకుంతల, జిల్లా కోశాధికారిగా ఎన్.రాజారాం, జిల్లా కార్యదర్శులుగా ఎం.జనార్ధన్, వి.సాయన్న, జి.ఆనందం, ఎం.పద్మావతి, డి.బాబులు, ఎం.రాజు, ఈ.శ్రీనివాస్, జి.గంగాధర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.లక్ష్మణ్, సభ్యులు ఎ.రఘు, పి.రాజేశ్వర్‌ను ఎన్నుకున్నారు.



ఓ.రమేష్



జి.గంగాధర్

నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయల ఏర్పాటుకు స్థలాలు అందజేయండి

- ఆర్ఓబీ నిర్మాణాల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి
- జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ ఓఎల్ఎస్ సర్వే చేసి కేంద్రానికి నివేదించండి
- సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న ఎంపీ అరవింద్

ఇటీవల కేంద్ర కేబినెట్ జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో నవోదయల ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయాల ఏర్పాటుకు స్థలాలు అందజేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్‌తో కలిసి ఈ రెండు జిల్లాల్లో నవోదయాల ఏర్పాటుకు ఒక్కోచోట సుమారు 20 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని రేవంత్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను ఎంపీ, సీఎంకు వివరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరిస్తూ, మాధవ్‌నగర్ ఆర్‌ఓబి 50-50 పద్ధతిలో మంజూరు చేయబడిందని, అడివి మామిడిపల్లి ఆర్‌ఓబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైనప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను మళ్లించిందన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, దీనివల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఇవేగాకుండా ఇతర ఆర్వోబీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని, కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తిచేసి కేంద్రానికి నివేదించాలని కోరారు. మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని సీఎంని కోరారు. జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ ఎంపీ అర్వింద్‌తో కలిసి జగిత్యాల పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. తమ విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపీ అర్వింద్ ప్రకటన విడుదల చేస్తూ, వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

మెనూ ప్రకారమే భోజనం అందించాలి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

విద్యార్థులకు మెనూ ప్రకారమే భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని బాన్సువాడ ఆర్డిఓతో కలిసి తనిఖీ చేశారు. వసతి గృహంలో ఉన్న ప్రతి గదిని పరిశీలించి వసతి గృహంలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వార్డెన్‌ను సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. మంచి చదువును బాగా అందించినప్పుడే వారి భవిష్యత్ బాగుపడుతుందని తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి కష్ట పడి బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ఎదగాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎంపీడీవో సంతోష్ కుమార్



నవతెలంగాణ-భీంగల్‌రూరల్

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్‌ను నియమిస్తూ టీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గెజిటెడ్ అధికారులు, ఎంపీడీఓలు, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధిహామీ కార్యాలయ సిబ్బంది, ఐకెపి కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

26న సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవాలను జయప్రదం చేయండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ నగర సమితి సమావేశం వై.ఓమయ్య అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 26న సిపిఐ 100వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలో, గ్రామ గ్రామాన పార్టీ జెండాలను ఆవిష్కరించి సభలు, సమావేశాలు జరపాలని పార్టీ శ్రేణులను కోరారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో సిపిఐ ఏర్పాటు నుండి నేటి వరకు ప్రజా సమస్యలపైన రాజీలేని పోరాటాల నిర్వహిస్తున్నదని అన్నారు. నగర సమావేశంలో నాయకులు పి.నర్సింగరావు, బి.రఘురాం, ఇమ్రాన్ అలీ, ముత్యాలు, పి.హనుమన్లు, అనిల్, రమేష్, గంగాధర్ పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వెంకటస్వామి (కాకా) వర్ధంతి



నివాళ్లు అర్పిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కమీషన రేటు కార్యాలయంలో నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్) జి. బస్వారెడ్డి వెంకటస్వామి (కాకా)వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డి.సి.పి (అడ్మిన్) బసవ రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్పూర్తిని నిలిపారని, పేదల పెన్నిదిగా పేరు గాంచారని తెలిపారు. భవిష్యత్ తరాలకోసం అనునిత్యం ప్రతిఒక్కరు కష్టపడాలని, భావి తరాల కోసం బంగారు బాట వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, ఎస్‌బి.ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, పోలీస్ కార్యాలయం సిబ్బంది, సిసిఆర్‌బి సిబ్బంది, సిఎస్‌బి సిబ్బంది, ఐ.టి కోర్ సిబ్బంది, కాంప్లెంటు సెల్, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లైంట్ సెల్ సిబ్బంది హాజరయ్యారు.

ముఖ్యమంత్రి సహాయనిధితో పేదల వైద్యానికి భరోసా

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయనిధితో పేద, మధ్యతరగతి ప్రజల వైద్యానికి ఎంతో భరోసా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ముగ్గురు లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కిష్ట గౌడ్ రూ.60వేలు, లావణ్యకు రూ.32వేలు, సరస్వతికి రూ.13వేల ఆర్థిక సహాయం చెక్కులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ చెక్కులను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి నాయకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, ఉట్నూరి ప్రదీప్, పూజారి శేఖర్, సుంకేట శ్రీనివాస్, సింగిరెడ్డి శేఖర్, పాలెపు చిన్న గంగారం, అజ్మత్ హుస్సేన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పివి రావ్, గడ్డం వెంకటస్వామి వర్ధంతి



నివాళ్లు అర్పిస్తున్న మాల ఉద్యోగుల సంఘం నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులోగల మాల ఉద్యోగుల సంక్షేమ సంఘంలో నిజామాబాద్ జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం పివి రావు, గడ్డం వెంకటస్వామి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాల మహానాడు నాయకులు పివి రావు, గడ్డం వెంకటస్వామి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పివి రావు మాల జాతికి చేసిన సేవలను కొనియాడారు. మాల వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి జాతి కోసం చేసిన త్యాగాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా మాల మహానాడు అధ్యక్షులు ఆనంపల్లి ఎల్లం, జిల్లా కార్యదర్శి నాంది వినయ్, మాల ఉద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షులు స్వామిదాస్, దేవిదాస్, కామారెడ్డి ఈడీఎస్సీ కార్పొరేషన్ దయానంద్, గంగాధర్, నాగారావ్, నారాయణ, దేవయ్య, వెంకటరమణ, రాజేష్, రాములు, శంకరయ్య అశోక్, మాల ఉద్యోగ సంఘం సభ్యులు, మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ధర్మోర గ్రామంలో రామ మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, నాగమ్మ విగ్రహ ప్రతిష్టపన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చరణాల మధ్య ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. గ్రామ వీడిసి, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు రవి ప్రకాష్, మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బురోల్ల అశోక్, మాక్లూర్ సొసైటీ డైరెక్టర్ దయాకర్ రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేలనే నమ్ముకున్న అన్నదాతలు

- కాలానుగుణంగా వ్యవసాయంలో మార్పులు
- నేడు జాతీయ రైతు దినోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

రైతుల సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదు అని దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ రైతులు, వ్యవసాయాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలివి. తాను పస్తులుండి ప్రపంచానికి అన్నం పెట్టేవాడు ఈ ప్రపంచంలో ఒక్క రైతు మాత్రమే. విత్తనం నాటి నుంచి పంట విక్రయం వరకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ గిట్టుబాటు కాకపోయినా నేల తల్లిని నమ్ముకుని రైతులు సేద్యం కొనసాగిస్తున్నారు. సాగు బాగుపడాలంటే కాలానుగుణంగా రైతు దృక్పథంలోనూ మార్పు రావాలి. పాత విధానాలకు స్వస్తి పలికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలి. తద్వారా ఉత్పాదిక వ్యయాన్ని సాధ్యమైనంత తగ్గించుకొని, దిగుబడులు పెంచుకుంటే వ్యవసాయం లాభాల బాట పడుతుందని అన్నదాతలు గ్రహించాలి. అన్నదాతల సమస్యలపై అనునిత్యం పోరాడిన భారతదేశ 5 వ ప్రధానమంత్రి, రైతు నాయకుడు చౌదరి చరణ్ సింగ్ జయంతిని పురస్కరించుకొని నేడు జాతీయ రైతు దినోత్సవం నిర్వహిస్తున్నారు.



రైతన్నల సమస్యలపై పోరాడిన మాజీ ప్రధాని...

రైతు సంఘం నాయకుడు నిరంతరం వారి పక్షాన నిలబడి పోరాటం చేసిన యోధుడు మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ 1902, డిసెంబర్ 23న ఉత్తర ప్రదేశ్‌లో జన్మించారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేవాడు. చిన్ననాటి నుంచి రైతు సమస్యలపై అవగాహన పెంచుకొని అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రశ్నించేవాడు. చౌదరి చరణ్ సింగ్ 1979 జూలై 28న భారత దేశ 5 ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా 1980 జనవరి 14 వరకే ప్రధానిగా పనిచేశారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చరణ్ సింగ్ పోరాటం చేశారు. ఈయన 1987 మే 29న మృతి చెందారు. 2001 నుంచి డిసెంబర్ 23న ప్రభుత్వం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఉత్తరప్రదేశ్ , మధ్యప్రదేశ్, గుజరాత్ రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అధికారికంగా రైతు దినోత్సవాలను నిర్వహిస్తున్నాయి.

విత్తన సాగుపైనే రైతుల ఆసక్తి...

విత్తన ఉత్పత్తి రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలకు విస్తరించగా, నిజామాబాద్ జిల్లాలో జొన్న, సజ్జ విత్తనాల ఉత్పత్తి అధికంగా ఉంది. విత్తన ఉత్పత్తి పంటల సాగులో ఆదాయం అధికంగా వస్తుండడంతో రైతులు అటువైపు మొగ్గుచూపుతున్నారు. అయితే సాధారణ పద్ధతుల్లో ఎకరాన విస్తీర్ణంలో వరి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చులు పోను 20 నుండి 30 వేలు మిగలడమే గగనం కాగా విత్తనోత్పత్తి పంటలు వేస్తే ఎకరాన కు 80 వేల నుంచి లక్షకు పైగా ఆదాయం వస్తుంది. ఈ పంటల సాగు క్లిష్టమైనదే అయినప్పటికీ, అనుభవజ్ఞులైన కూలీలతో సులువుగా సాగు చేపడుతున్నారు.

2018లో కదం తొక్కిన రైతన్న...

పసుపు ఎర్ర జొన్న పంటలకు గిట్టుబాటు ధర సాధన లక్ష్యంగా రైతులు జిల్లాలోని ఆర్మూర్ కేంద్రంగా ఫిబ్రవరి 15, 2018 సంవత్సరంలో కదం తొక్కారు. పసుపు ఎర్రజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌తో తలపెట్టిన రైతు దీక్షకు పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా నిషేధాజ్ఞలు విధించిన పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతన్నల రాస్తారోకో, ఆమరణ నిరాహార దీక్షలు అప్పట్లో సంచలనం సృష్టించాయి . 2008 సంవత్సరం గిట్టుబాటు ధర కోసం చేసిన రైతన్నల ఉద్యమంలో 25 వేల మంది రైతులు పాల్గొని ఉద్యమ బాట పట్టడం అన్నదాతల ఆగ్రహానికి గురిచేసింది.

ఉమ్మడి జిల్లాల్లో....

ఉమ్మడి జిల్లాలోని రైతులు వరి ,పసుపు ,మొక్కజొన్న, జొన్న ,సజ్జ ,సోయా లతో పాటు కందులు, పెసర ,పత్తి ఆరుతడి పంటలను వేస్తున్నారు.

డివిజన్‌లో..

వ్యవసాయంలోని రైతన్నల శ్రమ జీవనానికి ప్రతీకగా పేరొందిన అంకాపూర్ గ్రామం ఎందరికో ఆదర్శంగా నిలిచింది. డివిజన్‌లో ఒకప్పుడు రైతులు ఆరుతడి పంటలు కూరగాయల సాగు చేసేవారు .కాగా ప్రస్తుతం 80శాతం పైగా వరి పంటను సాగు చేశారు. గోదావరి ఆధారితంగా ఉన్న ఎత్తిపోతల పథకాలతో పాటు డివిజన్లోని గ్రామాల్లో చెరువులు, కుంటలు, బోర్లు ఉండడంతో వారి మొక్కజొన్న, పసుపు, జొన్న, సజ్జ పంటలను సాగు చేస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా 90 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటే అందులో వరి పంటనే 70,991 ఎకరాల్లో పండించారు. దేశంలో ఎక్కడైనా పసుపు పంట అంటే మొదటిగా గుర్తుకు వచ్చేది ఆర్మూరే. డివిజన్ వ్యాప్తంగా 5,266 ఎకరాలలో పసుపు వేశారు. నియోజకవర్గంలోని నందిపేట్ 26,594, మాక్లూర్ 24,482,03, ఆర్మూర్ ,19,915,26, వరి పంట, మొక్కజొన్న పంట నందిపేట్ 3098.14,మాక్లూర్ 82.01,ఆర్మూర్ ,5091,34, పసుపు పంట నందిపేట్ 1643,08, మాక్లూర్ 11,38, ఆర్మూర్3612,35 ఎకరాలలో సాగు విస్తీర్ణం కాగా అడుగడుగునా అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ

బంటు మహిపాల్, గోవింద్‌పేట్



అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఆధునిక పద్ధతుల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తూ అందరి మన్ననలు పొందుతారు మా జిల్లా రైతన్నలు. రైతు దినోత్సవ శుభాకాంక్షలు.

ప్రపంచ స్థాయి మార్కెట్‌కు

సోమ హేమంత్‌రెడ్డి, పిప్రి



ప్రపంచ స్థాయి మార్కెట్లో వ్యాపారులు మెచ్చిన పసుపును పండించిన రైతులు మా జిల్లాకు చెందినవారు కావడం అభినం దనీయం. ఆహార ధాన్యాలను పండించడంలోనే కాకుండా వాణిజ్య పంటలను పండిం చడంలో ముందంజలో ఉన్నాం.

ఎంఈఓకు విద్యార్థుల సమస్యలు పట్టవా?

- పిడిఎస్‌యు మండల అధ్యక్షులు అనిల్ కుమార్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థుల సమస్యలు ఎంఈవోకు పట్టవా.. పేద విద్యార్థులకు అన్యాయం జరిగితే ఎంఈఓ బాధ్యత వహిస్తారా? అని మండల పిడిఎస్‌యు అధ్యక్షులు అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామని వెళ్తే ఎంఈఓ ఆదేశం లేకుండా లోనికి రానివ్వలేదని అన్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. తను చెప్పిందే చేయాలి అనే విధంగా ఎంఈఓ హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. సర్వశిక్షా అభియాన్ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె బాట పట్టడంతో 15 రోజుల నుండి విద్యార్థులకు పాఠాలు చెప్పడం లేదని, విద్యార్థులకు అనేక సమస్యలు ఉన్నాయని వారి గురించి తెలుసుకోవడానికి పిడిఎస్‌యు బృందంగా వెళ్లామన్నారు. విద్యార్థులకు మార్చ్ నెలలో జూనియర్, 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ షెడ్యూల్ వచ్చిందన్నారు. ప్రాక్టికల్స్ డేట్స్ కూడా ఇచ్చారని, విద్యార్థులతో మాట్లాడడానికి వెళితే ఎంఈఓ శ్రీనివాస్ నా ఆజ్ఞ లేకుండా ఎవరు రాకూడదు మాట్లాడకూడదు అని హుకుం జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎంఈఓ వ్యవహారంపైన ఉన్నతాధికారులకు కూడా తమ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించి విద్యార్థులకు పాఠాలు బోధించే విధంగా చేయాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మమత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- యుఎస్ఎఫ్ఐ
- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకు యూఎస్ఎఫ్ఐ రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యూఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్-యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిద్ధల నాగరాజు మాట్లాడుతూ.. 15రోజులుగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను పట్టించుకోవడంలేదని తామ అధికారంలోకి వస్తే వారందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి వారి సమస్యలను మర్చిపోవడం చూస్తుంటే పాలకవర్గం మారిందే తప్ప పాలన కాదు అని అర్థమవుతుందని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు గణేష్, పోషమైన మహేష్ మరియు యుఎస్ఎఫ్ నిజామాబాద్ నగర కమిటీ సభ్యులు వేణుగోపాల్,మారుతి,విశాల్ మారుతి, మధు, పోశెట్టి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

చిత్ర పరిశ్రమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనడం సరికాదు

- చిత్ర పరిశ్రమను మద్రాస్ నుంచి తెచ్చిందే కాంగ్రెస్
- టీపీపీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

చిత్ర పరిశ్రమపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ లోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్రాస్ నుంచి చిత్ర పరిశ్రమను తీసుకొచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. పద్మాలయ, రామానాయుడు స్టూడియోలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూములు ఇచ్చి చిత్ర పరిశ్రమను ప్రోత్సహించిందన్నారు. జనాలను ఇబ్బందులకు గురి చేసేది ఎవరైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోయి ఆమె కొడుకు చావుబతుకుల మధ్య ఉంటే దానిపై బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తమకు ఎవరిపై ద్వేషం లేదని, ప్రభుత్వానికి అంతా సమానమని అన్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడితే లేనిపోని ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌లో అడ్డంగా దొరికిన కేటీఆర్ మొన్నటి వరకు జైలుకు వెళ్లేందుకు సిద్ధమని ఇప్పుడు కోర్టును ఆశ్రయిస్తున్నారని విమర్శించారు.



మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

త్రిపుర రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రింగ్ ఫెస్టివల్ త్రిపుర రాష్ట్ర నూతన సంవత్సర వేడుకలు రెడ్ క్రాస్ తెలంగాణ సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గవర్నర్ సుధా వర్మ, రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటెల రాజేందర్, బి. వెంకటేశం- చైర్మన్ టిజిపిఎస్సి, రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ అజయ్ మిశ్రా, రిటైర్డ్ ఐఎఎస్, రాష్ట్ర సెక్రెటరీ శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, వివిధ జిల్లాల చైర్మన్లు రాష్ట్ర మేనేజ్మెంట్ సభ్యులు అండ్ తెలంగాణలో నివసిస్తున్న త్రిపుర ప్రజలు పెద్ద ఎత్తున త్రిపుర, తెలంగాణ నుండి సాంస్కృతిక కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, రాష్ట్ర గవర్నర్ గవర్నర్ ని శాలువాతో సత్కరించి త్రిపుర రాష్ట్ర నూతన ట్రింగ్ ఫెస్టివల్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ.. మొట్టమొదటి సారి ఇలాంటి ఉత్సవాలు రెడ్ క్రాస్ తెలంగాణ ఆధ్వర్యంలో చేయడం అభినందనీయం అన్నారు. జాతీయ సమైక్యతకు నిదర్శనం ఒక రాష్ట్ర సంస్కృతి ఇంకో రాష్ట్ర ప్రజలు సాంస్కృతిని పంచుకోవడం ద్వారా తెలంగాణ త్రిపుర రాష్ట్ర సంబంధాలను బలపరచడం అని అందరికీ శు భాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న రెడ్‌క్రాస్‌సభ్యులు

స్పోర్ట్స్ అండ్ టాలెంట్ కార్యక్రమం



స్పోర్ట్స్ అండ్ టాలెంట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్ సహారా ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ 320-డి గవర్నర్ నగేష్ నిర్దేశించిన స్పోర్ట్స్ అండ్ టాలెంట్ డే నిర్వహణలో భాగంగా ప్రభుత్వ ఎస్సి హాస్టల్ (బాలికల), మహాలక్ష్మినగర్, నిజమాబాద్‌లో ఖోఖో, కబడ్డి, పాటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లయన్ ఉదయ సూర్య భగవాన్, అధ్యక్షులు నరసింహారావు, కార్యదర్శి ధనుంజయ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండా అమర్ నాథ్, సభ్యులు పోశెట్టి, కాలనీ వాసులు పాల్గొని విద్యార్థులను అభినందించి క్లబ్ సేవలను కొనియాడారు. క్రీడల నిర్వహణకు కృషిచేసిన పిఈటి మణికుమార్‌ను సన్మానించి బహుమతి అందజేశారు. రాబోవు రోజుల్లో మరెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఇప్పటివరకు 120 కార్యక్రమాలు చేయడం జరిగిందని జిల్లా కార్యదర్శి లయన్ ఉదయ సూర్య భగవాన్ తెలిపారు.


ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 1000 పడకలకు పెంచండి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదర రాజానరసింహను కలిసి కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) జిల్లా గౌరవాధ్యక్షులు వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాలని పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికుల వేతనాలు పెంచాలని మంత్రికి తెలిపారు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహారాష్ట్ర, కర్ణాటకలోని కొన్ని జిల్లాల వారు ఆరోగ్య పరీక్షల కోసం ప్రతిరోజు సుమారు అవుట్ పేషంట్ లు 2500 మంది ఇన్ పేషెంట్లు 1500 మంది ఉంటున్నందున జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులపై పనిభారం పెరుగుతుందన్నారు. కావున వెయ్యి పడకలకు పెంచి శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందిని పెంచి కార్మికులకు వెంటనే జీవో నెంబర్ 60 ప్రకారం రూ.13,400 తోపాటు అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమది భాగ్యలక్ష్మి వెంకట్ రాధా కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడర్‌గా సుదర్శన్ నియామకం



నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా అమిదాల సుదర్శన్ నియామకమయ్యారు. ఈ మేరకు లీగల్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుదర్శన్ మూడేళ్ల పాటు ప్రభుత్వం తరఫున సివిల్ కేసులను వాదించనున్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


వివాహంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఎక్కపల్లి తండా మాజీ ఎంపీటీసీ మున్యా నాయక్ కుమార్తె వివాహ వేడుకకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి కుమార్తె నిశ్చితార్థంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, సమన్వయ కమిటీ మండలాధ్యక్షులు ఎల్లమయ్య జిల్లా దిశ కమిటీ సభ్యులు రాజప్ప, మాజీ సర్పంచ్ సక్రు, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ నాయక్, డైరెక్టర్లు ఫుల్‌సింగ్, గోపాల్, భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

చీఫ్ మినిస్టర్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు తాడ్వాయి విద్యార్థులు



నవతెలంగాణ-తాడ్వాయి
చీఫ్ మినిస్టర్ రాష్ట్రసాయి వాలీబాల్ పోటీలకు 18 ఏళ్ల విభాగంలో తాడ్వాయికి చెందిన అబ్దుల్ సమీర్, మద్ది విశాల్‌రెడ్డి, శ్రీకర్ యాదవ్ ఎంపికైనట్లు సీనియర్ క్రీడాకారులు మిద్దె స్వామి ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఖమ్మంలో డిసెంబర్ 27 జనవరి 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు కూడా ఎంపిక కావాలని గ్రామస్తులు బండారి సంజీవ్, ముదాం నర్సింలు, మేకల రాజు, పి.జగదీశ్వర్, బి.సంజీవరెడ్డి గ్రామస్తులు తదితరులు అభినందించారు.

ఏఐలో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన రైతుబిడ్డ..

- ఎన్ఆర్ఐ శశి సలావత్
- ప్రపంచ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై పరిశోధనలు

నవతెలంగాణ-కామారెడ్డి
కేవలం 17 ఏళ్ల వయస్సులో ఇల్లినాయిస్ మ్యాథ్ అండ్ సైన్స్ అకాడమీ (ఐఎంఎస్‌ఏ)లో ఉన్నత పాఠశాల సీనియర్ అయిన శశి సలావత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో ఓ వెలుగు వెలుగుతున్నాడు. అతని సంచలనాత్మక ఆవిష్కరణలు అతనికి ప్రపంచవ్యాప్త గుర్తింపును సంపాదించడమే కాకుండా కొత్తతరం యువ ఆలోచనాపరులను ప్రేరేపిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట్ తండా అనే చిన్న గ్రామం నుంచి కృషి, విద్య విలువలు అతని ఎదుగుదలను రూపొందించాయి. అతని తండ్రి శంకర్ సలావత్, బీద స్థితిలో ఉన్న ఆయన కుటుంబాన్ని పోషించేందుకు వారికి ఉన్న చిన్న పొలంలో కష్టపడి పశువుల నుంచి వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించేవారు. శశి తండ్రి శంకర్ విద్యను అభ్యసించడానికి ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. శంకర్ అనేక సవాళ్లను అధిగమించి హైదరాబాద్‌లో గల ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. తన కుటుంబానికి మంచి భవిష్యత్తు ఉండాలనే కోరికతో అతను తన ఉద్యోగాన్ని విడిచిపెట్టి, గొప్ప అవకాశాల కోసం యునైటెడ్ స్టేట్స్‌కు వెళ్లాలని సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు.





ఏఐలో శశి చేసిన పరిశోధనలు..
అక్టోబర్ 2024లో ఊఏఈలోని దుబాయిలో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై జరిగిన ఐఈఈఈ 17వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో శశి తన పరిశోధనను ఆవిష్కరించాడు. శశి తాజా పరిశోధన క్యాన్సర్ ఇమ్యునోథెరపీ చికిత్సల కోసం రోగి ఫలితాలను మెరుగుపరచడానికి పర్సనలైజ్డ్ హెల్త్‌కేర్ సొల్యూషన్లను రూపొందించడంపై దృష్టి సాధించాడు. ఈ వినూత్న విధానంతో రోగి డేటాను డైనమిక్ అల్గారిథమ్లతో వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు చెయ్యడానికి ప్రపంచ ఆరోగ్య సంరక్షణ పద్ధతులను సమర్థవంతంగా మార్చడానికి ఉపయోగపడుతుంది. జూలై 2024లో, స్పెయిన్, యూరప్‌లో జరిగిన 24వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంప్యూటేషనల్ సైన్స్ కేర్ (ఐసీఎస్)లో శశి తన సంచలనాత్మక సాఫ్ట్‌వేర్ భావనను సమర్పించాడు. ఇది చరిత్రలో అతి చిన్న వయస్సు గల వ్యాఖ్యతగా, సంక్లిష్టమైన వైద్య డేటాసెట్లను సులభతరం చేయడానికి ఉపయోగించాలనే తన దృష్టితో శశి ప్రేక్షకులను ఆకర్షించాడు. సాంకేతిక నైపుణ్యంతో సంబంధం లేకుండా వైద్యులు సమాచార నిర్ణయాలు తీసుకునేలా చేశాడు. జూన్ 2023లో, శశి చైనాలోని హాంగ్ జౌలోని వెస్ట్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ పరిశోధన బృందంలో చేరాడు. అక్కడ అతను సబ్మెర్సిబుల్, రోబోటిక్స్, సస్టైనబిలిటీ ఇనిషియేటివ్ల కోసం అప్లికేషన్లపై పనిచేశాడు. శశి తండ్రి గ్రామీణ భారతదేశం నుంచి యునైటెడ్ స్టేట్స్ వరకు చేసిన ప్రయాణం శశిని అడ్డంకులను అధిగమించడానికి దోహద పడింది. ప్రస్తుతం నార్త్ వెస్టన్ యూనివర్శిటీ వారి స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ఏఐపై పరిశోధన చేస్తున్న శశి, ఆవిష్కరణల అన్వేషణ హద్దులను దాటుతున్నాడు. ఏఐ, ఆరోగ్య సంరక్షణపై అన్వేషణను ఖండాతరాలకు విస్తరిస్తున్నాడు. అమెరికాలోని ఉత్తమ యూనివర్సిటీలు అయిన స్టాన్ఫోర్డ్, బ్రౌన్, జార్జియ టెక్‌లాంటి వాటిలో, శశి తన పరిశోధనలను చెయ్యడానికి కృతనిశ్చయంతో ఉన్నాడు. శశి ప్రయాణం మారుమూల గ్రామం నుంచి ప్రారంభంమై, అత్యుత్తమ విద్య శక్తితో విప్లవాత్మకమైన ఆరోగ్య పరిరక్షణను ఏఐతో సాధించడానికి తనవంతు కృషి చేస్తున్నాడు. శశి సాధించిన ఘనత, అతను స్వీకరించిన సవాళ్లు నేటి యువతకు విద్యారంగంలో, తమ దేశప్రగతిని చాటడానికి ఎంతగానో దోహద పడటానికి నిదర్శనం.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండలంలోని పోచారం గ్రామానికి చెందిన టేకులపల్లి శ్రీనివాసరెడ్డి ఇటీవలే గుండెపోటుతో మరణించడంతో విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఆదివారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

బూత్ కమిటీల నూతన కార్యవర్గం నియామకం


ఏంపికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-గాంధారి
మండలంలోని 33వ బూత్ గుర్జల్ గ్రామంలో నూతన బూత్ కమిటీ ఏర్పాటు చేసినట్టు బూత్ అధ్యక్షునిగా అయ్యాలా గోవర్ధన్‌ను ఎన్నుకున్నట్లు బిజెపి మండలాధ్యక్షుడు మధుసూదన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈకే ప్రభాకర్, సీనియర్ నాయకులు మాణిక్ రావు, శ్యామ్, గోవర్ధన్, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని 14వ బూత్ తిప్పారం గ్రామంలో నూతన బూత్ కమిటీ ఏర్పాటు చేసినట్టు వివరించారు. బూత్ అధ్యక్షునిగా సోలంకి రాజేశ్వరరావును ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

- ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్
మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మన్నెపల్లి రాజు శనివారం రాత్రి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో మృతుని కుటుంబం వద్దకు వెళ్లి పార్థిక దేహానికి పూలమాలవేసి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఇద్దరు కుమారులను కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మండల సమన్వయ కమిటీ కన్వీనర్ వంజరి ఎల్లమయ్య, కాంగ్రెస్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, షాదుల్లా, గులాం ప్రసాద్ గౌడ్, రాజు, భాష, బాలయ్య, మునీర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలున్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాడ్వాయి
మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహీముద్దీన్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు జరిగే ప్రజావాణిలో ఏవైనా సమస్యలుంటే మండల వాసులు ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరవుతారని తెలిపారు.

కొత్త హంగులతో గ్రంథాలయం

నవతెలంగాణ-తాడ్వాయి
మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయం కొత్త హంగులతో కళకళలాడుతోందని నిరుద్యోగ యువతీ యువకులు తెలిపారు. గత దశాబ్ద కాలం నుంచి మరమ్మతులు చేపట్ట లేదని, రెండు నెలల క్రితం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టి రెండు పర్యాయాలు పర్యవేక్షణ చేసి కలరు ఎలక్ట్రిషన్ ఫ్యాన్లు నీటి సౌకర్యం లేకపోవడంతో మరమ్మతులు చేపట్టారని దీంతో తమ తోటి పాఠకుల సంఖ్య మరింత పెరిగిందని తెలిపారు.

నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండలంలోని తాండూర్ సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విక్రాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విటల్‌రెడ్డి, నరసింహారెడ్డి, సంజీవులు, భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్
మండలంలోని వాడి గ్రామానికి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు పార్టీ అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పచ్చింటి చందర్, గడ్డం అశోక్, గడ్డం కిష్టయ్య, కోడె హనుమంతు, కోడే సాయిలు, చిన్ని సాయిలు, బాలలింగం గోపాల్, బల్లింగం రాఘవులు, గడ్డం నర్సింలుతో పాటు 50 మంది చేరినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా పద్మావతి మల్లన్న స్వామి కళ్యాణ మహెూత్సవం

నవతెలంగాణ-బోధన్
బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామంలో ఆదివారం గ్రామస్థులు పద్మావతి మల్లన్న స్వామి కళ్యాణ మహెూత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలు ఎత్తుకుని ఆలయానికి తరలివెళ్లారు. డప్పు సప్పుళ్ల పోతరాజుల విన్యాసాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మల్లాపూర్‌లో బారడి పోచమ్మ పండుగ



నవతెలంగాణ-మద్నూర్
మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఆదివారం ఆ గ్రామ ప్రజలు బారడి పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఇంటింటా బోనాలు నైవేద్యాలు సమర్పించారు. ప్రతి కుటుంబీకులు నైవేద్యాలు సమర్పణ అనంతరం ఆలయ సమీపంలో భోజనాలు చేశారు.

ముఖ్యమంత్రి.. హామీని నిలబెట్టుకోండి

- గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం లింగం
- సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మెకు మద్దతు



నవతెలంగాణ-కామారెడ్డి
సమగ్ర శిక్ష ఉద్యోగులు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మె కార్యక్రమంలో ఉద్యోగులు తమ పిల్లల ఆటపాటలతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మెకు మద్దతుగా జిల్లాలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు నీలం లింగం మాట్లాడుతూ.. సీఎం వందరోజుల గ్యారెంటీ ఏమైందని, ఇప్పటికీ సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగుల సేవలు పాఠశాల స్థాయిలో, కాంప్లెక్స్ స్థాయిలో, ఎంఆర్‌సి, కేజీబీవీ, డిపిఓ కార్యాలయంలో వారి సేవలు మరువలేనివని అన్నారు. విద్య శాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులు లేకుంటే ఆ లోటు ఏంటో ఏర్పడదని ఉద్యోగులు చేస్తున్న సేవకు ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రాష్ట్రస్థాయిలో గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం మద్దతు ఉంటుందని, అవసరమైతే రానున్న రోజుల్లో మీకోసం తాము కూడా నేరుగా ఉద్యమంలో ఉంటామని, అన్ని రకాల సహాయం అందిస్తామని సమగ్ర శిక్ష ఉద్యోగులకు హామీనిచ్చారు. ఇప్పటికే విద్యా వ్యవస్థలు అన్ని సేవలు నిలిచిపోయారని, రానున్న రెండు రోజుల్లో కేజీబీవీకి తాళాలు వేసి డిఇఓకు అందజేస్తామని ప్రభుత్వానికి ఉద్యోగులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, మహిళా సంఘం అధ్యక్షురాలు వాసంతి, నాయకులు సంపత్, రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, కాళిదాసు, వీణ, సాయిలు, లావణ్య, శ్రీను, మాధవి, యోగేష్, బన్సీలాల్, దినేష్, రాజు, రాధికా, లింగం, కృష్ణ, మాధవి ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని రకాల వ్యవసాయ కూలీలకు ఆసరా భృతి అందించాలి

- అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ
- అందరికీ ఆసరా భృతికోసం పెద్దఎత్తున ఆందోళన

నవతెలంగాణ-కామారెడ్డి
ఉపాధి కూలీలతో పాటు అన్ని రకాల వ్యవసాయ కూలీలందరికీ ఆసరా భృతి అందించాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం 12వేల ఆసరా భృతిని 6వేల చొప్పున రెండు విడతలుగా కూలీలకు ఈ నెల 28 నుంచి ఇవ్వనున్నట్టు ప్రకటించడం హర్షించదగ్గ విషయమని, కానీ కండిషన్‌గా 100 రోజులు పని చేసిన ఉపాధి కూలీలకే ఇస్తామనడం అమోదించదగిన విషయం కాదని తెలిపారు. ఉపాధికూలీలు కాకుండా వ్యవసాయ రంగంలో అనేక రకాల పనులు చేసే కూలీలు ఉన్నారన్నారు. వీరికి ఆసరా భృతిని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 51 లక్షలు జాబ్ కార్డులున్నాయని ప్రభుత్వమే చెప్తుందన్నారు. ఈ సమావేశంలో (సిపిఐఎంఎల్) మాస్‌లైన్ కామారెడ్డి జిల్లా నాయకులు ఎ.ప్రకాష్, పిడిఎస్‌యు రాష్ట్ర కోశాధికారి జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి.. కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి

నవతెలంగాణ-కామారెడ్డి
దళిత బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి అని పలువురు అన్నారు. ఆదివారం కామారెడ్డి కలెక్టరేట్‌లో వర్ధంతిని అధికారికంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వెంకటస్వామి చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రాతినిధ్యం వహించారని, దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని అన్నారు. వర్ధంతి వేడుకలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ జ్యోతి, వెంకట్ రాజు, రాజేందర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో నిరసన కార్యక్రమాలు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-కామారెడ్డి
ఈ నెల 24, 25వ తేదీలలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఏఐసీసీ ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర ముఖ్య ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ ఆదేశానుసారం 24, 25 తేదీలలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పండ్లరాజు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు దేవరాజ్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, లక్క పతిని గంగాధర్, తేజపు ప్రసాద్ పాల్గొన్నారు.


రెండవ రోజు కొనసాగిన మల్లన్న ఉత్సవాలు

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. పట్టణంలోని దేవునిపల్లిలో శనివారం ప్రారంభమైన ఉత్సవాలు.. రెండవ రోజు ఆదివారం ఉదయం మల్లన్న ఉత్సవాల్లో భాగంగా మల్లన్న దేవునికి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఊరడమ్మ, నల్ల పోచమ్మ, ముత్యాలమ్మ, పెద్దపురం మల్లయ్య, బీరప్ప స్వామి, ఎల్లమ్మ, బంగారు మైసమ్మ, పోతు లింగయ్య, కట్ట మైసమ్మ, గంగమ్మ, బుసత్తవ్వ, శివాలయం, హనుమాన్ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పురోహితులు పత్రి చెట్టుకు పూజ చేసి అగ్నిగుండాలకు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, అధ్యక్షుడు గుడేల్లి గంగారాం, ఉపాధ్యక్షులు వంగ రాహుల్ కుమార్, నిట్టు లింగారావు, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, కోశాధికారి నాగళ్ల స్వామి (ధోని), సభ్యులు మీసాల నవీన్, శ్రీను, బోడొల్ల రాజేందర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి బల్దియాలో ఇంటి దొంగలపై జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలని సిపిఐ కామారెడ్డి జిల్లా కమిటీ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతిపై విచారణకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారుల నియమించాలని ఏఐటీయూసీ, సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది వి.ఎల్ నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయంలో అవకతవకలపై చర్య తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వాటర్ వర్క్స్ సెక్షన్‌లో భార్యలు కౌన్సిలర్లు అయితే భర్తల ఆధిపత్యం కొనసాగుతుందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ కామారెడ్డి మున్సిపల్‌పై ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజు, సిపిఐ జిల్లా నాయకులు ఎం.దేవయ్య, బత్తుల ఈశ్వర్, ఎం.మల్లేష్, సాయిలు, కాసిం, రాజమణి, పుష్పలత, శ్యామల, నజీర్, లక్ష్మణ్, రాజిరెడ్డి, రాజు, భీమ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుప్రియాల్‌లో నూతన బూత్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కార్యవర్గం

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని కుప్రియాల్ గ్రామంలో నూతన బూత్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు బిజెపి మండలాధ్యక్షులు కుంట రామిరెడ్డి తెలిపారు. గ్రామ కార్య కర్తల ఏకాభిప్రాయం నిర్ణయంతో బూత్ 95 అధ్యక్షుడు శ్రీఅఖిల్‌రెడ్డి, 96 ఎర్రవాటి సంతోష్, 97 ఆకిటి భూపాల్ రెడ్డిని ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గరుడ రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కాటిపల్లి భాస్కర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యులు ప్రేమ్‌రెడ్డి, జిల్లాల రమేష్‌రెడ్డి, బిజెపి పూర్వ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గణితం.. ఆలోచన శక్తిని పెంపొందిస్తుంది


మాట్లాడుతున్న ఎంఈఓ నాగయ్య


నవతెలంగాణ-బోధన్
గణితం ఆలోచన శక్తిని పెంపొందిస్తుందని బోధన్ ఎంఈఓ నాగయ్య అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌లో నిర్వహించిన శ్రీరామానుజన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన గణిత దినోత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గణితం వలన సృజనాత్మక శక్తి పెరుగుతుందని, కావున ప్రతి విద్యార్థి గణితంలో రాణించాలని సూచించారు. అనంతరం గణితం క్విజ్ పోటీలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. గణిత బోధకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి అధ్యక్షులు రామకృష్ణ, సభ్యులు కేవీ సత్యనారాయణ, శ్రీనివాస రాజులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



నవతెలంగాణ-రెంజల్
మండల కేంద్రమైన రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం ప్రారంభోత్సవానికి విచ్చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రెంజల్ ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి ఎస్సి వర్గీకరణపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీగారి భూమయ్య మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ద్వారా వెలువడిన ఎస్సీ వర్గీకరణ అమలును అన్నీ రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు ఇచ్చిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సీ వర్గీకరణలో 59 ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బండారి పోశెట్టి, కిన్నెర మోహన్, తాడెం అబ్బయ్య, లక్ష్మీగారి నరేష్, దగ్గుల రూపేష్, ప్రకాష్, సురేష్, ప్రభాకర్, కళ్యాణ్, తేజ, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-బిచ్కుంద
బిచ్కుంద మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో గల అయ్యప్ప మందిరంలో సామూహిక మండల మహా పడిపూజను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మందిరంలో ఉదయం గణపతి హెూమం, ఉత్సవ విగ్రహ ఊరేగింపు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం అయ్యప్ప మందిరంలో రుద్రాభిషేకం, పడిమెట్ల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిచ్కుంద మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బిచ్కుంద అయ్యప్ప సేవా ట్రస్ట్ సభ్యులు అన్నత్‌వార్ అశోక్, ప్రేమ్‌కుమార్, హాజీ బాబ్రాజ్, గజానన్ మహారాజ్, రమణ, మహేందర్, దర్పల్ గంగాధర్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ వారోత్సవాలు

- స్వామివారికి బోనాలు సమర్పణ

నవతెలంగాణ-గాంధారి



మండల కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం మొదటి వార్షికోత్సవస్త్ర సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం నుంచి మంగళవారం వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మల్లన్న దేవునికి యాదవ కులస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి సాయంత్రం బోనాలు సమర్పించారు.

ప్రతిభకు సత్కారం

ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైన గణిత శాస్త్ర విషయ నిపుణులు

నవతెలంగాణ- కామారెడ్డి

2024 తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు గా చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత శాస్త్ర విషయ నిపుణులు విజయగిరి రామకృష్ణ ఎంపికయ్యారు. వీరిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాదులోని హయత్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూర రగోతం రెడ్డి సన్మానించారు. గణితంలో రామకృష్ణ చేసే ప్రయోగాలు, కృత్యాధారణ బోధన, వివిధ పోటీ పరీక్షలకు తార్కిక ఆలోచనల ద్వారా విద్యార్థులను సంసిద్ధులుగా వీరు చేస్తున్న కృషితో పలువురి మననలు పొందారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ , టీ ఎం ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్, కార్యదర్శి వై రామకృష్ణ, అధ్యక్షులు తాడ్వాయి శ్రీనివాస్, రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ శ్రీధరాచార్యులు, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, కార్యదర్శి రామారావు, ఆర్థిక కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నాయి

- ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నాయి అని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. యాసంగి పంట కోసం గుత్ప ఎత్తిపోతల నుండి ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొత్తం34,650 ఎకరాలకు నీరు అందిస్తాం అని దీని ద్వారా ఆర్మూర్, నందిపెట్, మక్లూరు, ఆలూరు, వేల్పూర్, జక్రాన్‌పల్లి రైతులకు నీరు అందుతుందన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందించే వరకు నీటి విడుదల ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం 545క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. అవసరం మేరకు మరింత నీటిని కూడా విడుదల చేస్తామని, రైతులు అధైర్య పడకుండా ఉండాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టు బాటు ధరను కల్పించాయని అన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ అధికారిని యశస్విని, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దుబాయిలో గుండెపోటుతో మాక్లూర్ వాసి మృతి



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రానికి చెందిన యువకుడు జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లి గుండె పోటుతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల.కేంద్రానికి చెందిన ఫారత్ (36) వారం క్రితం దుబాయ్ వెళ్ళాడు. శనివారం అర్ధ రాత్రి దుబాయిలో నిద్రిస్తుండగా గుండె పోటు వచ్చి అక్కడిక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతునికి భార్య ఒక కూతురు ఉన్నారని అన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



మెండోర : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ - మెండోర/ మాక్లూర్

అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. పోచంపాడ్ ఎన్ హెచ్ 44 జాతీయ రహదారి ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్ సంఘాల నాయకులు నిరసనలు తెలుపుతూ అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నాయకులు సావెల్ గంగాధర్ మాట్లాడుతూ పార్లమెంట్ లో కేంద్ర హెంశాఖ మంత్రి పదవిలో ఉండి రాజ్యాంగ నిర్మాత అయిన అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యాలు చేయడం సిగ్గుచేటు అని అన్నారు. తక్షణమే అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ శక్తులకు మద్దతు చేసే మతోన్మాద బీజేపీ శక్తులు అధికారంలోకి వచ్చాక దేశంలో ఒకపక్క దళితులపై దాడులు పెరిగిపోతుంటే కట్టడి చేయాల్సిన అమిత్‌షా తన బాధ్యత మరిచి ఇలాంటి చౌకబారు మాటలు మాట్లాడటం సరికాదన్నారు. రాజ్యాంగ విలువలు తెలియని అమిత్ షా లాంటి అసమర్థులను పార్లమెంట్‌కు పంపడం ప్రజల దురదృష్టకరమని తెలిపారు. అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షాకు కేంద్ర మంత్రి హెూదాలో కొనసాగే హక్కు లేదని మండిపడ్డారు.రాజ్యాంగంపై ప్రమాణాలు చేసి పార్లమెంటు కు వెళ్లిన అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలపై మోడీ స్పందించాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ నాయకులు సావెల్ గంగాధర్, బురుకల కమలాకర్, మిస్బొద్దిన్, నాయకులు మండల, గ్రామాల నుండి అధిక సంఖ్యలో యువకులు, మహిళలు, ప్రజలు హాజరయ్యారు.

మాక్లూర్ :మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మను అంబేద్కర్ సంఘం సభ్యులు, కాంగ్రెస్, బీఆర్ ఎస్ నాయకులు ఆదివారం దహనం చేశారు. రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్‌పై చేసిన వాక్యాలకు నిరసనగా అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు శశాంక్, సుశీల్ కుమార్, అజయ్, సునీల్, ఘన శ్యామ్, మనోజ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్ రావు, రాజేందర్, లక్ష్మినారాయణ, మెదరి అనిల్, పట్నం సాయిలు, టీ అర్ ఎస్ నాయకులు కొక హైమద్, దర్గల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



మాక్లూర్‌లో..

వెంకటస్వామి ఆశయ సాధనకు కృషి చేయాలి

- పీవీ రావు, కాకా వెంకటస్వామిలకు ఘన నివాళులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు, తొలి, మలి దశ తెలంగాణ పోరాట యోధుడు, కార్మిక వర్గ క్రాంతిరేఖ, గూడులేని ప్రజల జీవితాల్లో గుడిసై వెలుగులు నింపిన కేంద్ర మాజీ మంత్రివర్యులు గడ్డం వెంకటస్వామి(కాకా)ల వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో మాల సంఘాల జేఏసీ ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ కో-చైర్మన్ అంగరి ప్రదీప్ మాట్లాడుతూ మాల సామాజిక వర్గ అస్తిత్వం, ఆత్మగౌరవం, ఐక్యత,అభివృద్ధి కొరకు తమ జీవితాలను దారబోసిన పీవీ రావు, కాకా వెంకటస్వామిని మాల యువత ఆదర్శంగా తీసుకుని మాల జాతి అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. పీవీరావు దళితులను ఉప వర్గీకరించే మనువాద పాలకుల కుట్రలకు వ్యతిరేకంగా పోరాడి దళితుల హక్కులు, ఆత్మగౌరవం కోసం తన జీవితాన్ని తృణప్రాయంగా వదిలిన త్యాగశీలి అని అన్నారు. మలి దశ తెలంగాణ పోరాటంలో పాల్గొని తెలంగాణ ఆకాంక్షను జాతీయ స్థాయిలో వినిపించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ పెద్దలను ఒప్పించి 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సాకారం చేసిన గొప్ప నాయకుడు కాకా వెంకటస్వామి అని అన్నారు. కాకా కార్మిక మంత్రిగా అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని అసంఘటిత రంగంలోని కార్మిక లోకానికి పెన్షన్ ఇప్పించిన ఘనుడన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ మాల సంఘాల జేఏసీ సభ్యులు పింజ పెద్ద బోజన్న, షెట్పల్లి నారాయణ, పులి సాయిరాం,నగసేన్ మాల, అగ్గు క్రాంతి, పింజ భూమేశ్వర్, టీం నాయకులు ఆంద్రయ్య, అబ్బా రవి, వినయ్ కుమార్, మామిడి రవీందర్, రత్నం, అంబులెన్స్ రాజు, వికాస్, తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

కలెక్టరేట్లో జి.వెంకటస్వామి వర్ధంతి

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బోధన్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ముత్తెన్న, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెంకటస్వామితో తనకు గల అనుబంధాన్ని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వర్ధంతి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

గాంధారి మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన గడ్డం కిష్టగౌడ్ కుమారుడు అనిల్ గౌడ్ వివాహం ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ముత్యపు రాఘవుల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకలకు మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితో పాటు మాజీ జడ్పీటీసీ సామెల్, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయం ముందర ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్టు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

16వ రోజుకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్



మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 16వ రోజు సమ్మె లో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పిల్లలతో హాజరై చదువులు చెప్పే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, భూపెందర్ మాట్లాడుతూ రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరిస్తామని చెప్తూ తాత్సారం చేస్తుందన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు కులాచారి దినేష్, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ ,మహిళా అధ్యక్షురాలు గంగామణి, మహిళా కార్యదర్శి స్వప్న, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్ సత్యపాల్ గంగాధర్ ,ప్రభు ,రమేష్ ,రాణి, సుప్రజా ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మద్దతు తెలిపిన పిడిఎస్‌యు నాయకులు

ఆర్మూర్ :పీడీఎస్‌యు ఆధ్వర్యంలో సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతూ పట్టణంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల కళాశాలలో ఆదివారం విద్యార్థులతో కలిసి సమ్మెకు మద్దతు తెలిపారు. వారి సమస్యలపైన మాట్లాడారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎం నరేందర్ మాట్లాడుతూ.. 15 రోజులుగా ఎస్ఎస్ఎ ఉద్యోగ భద్రత, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరైన విధానం కాదన్నారు. పాఠాలు బోధించడంలేదని, మరోవైపు ఇంటర్ బోర్డు, ఎస్ఎస్సి బోర్డు పరీక్షల తేదీలను మార్చిలో ఖరారు చేసిందన్నారు. పరీక్షల సమయం దగ్గర పడటంతో విద్యార్థులు ఆందోళన గురవుతున్నారని తెలిపారు. వారితో చర్చించి వెంటనే సమ్మెను విరమింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు అనిల్ కుమార్, ఏరియా కార్యదర్శి నిఖిల్, నాయకులు మమత, సాయిరాం, నవనీత్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షునిగా లక్ష్మీ నర్సయ్య

నవతెలంగాణ-ఆర్మూర్



(టీఎస్ జిహెచ్‌ఎం) తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణంలోని జడ్పిహెచ్‌ఎస్ బాయ్స్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి.లక్ష్మినర్సయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం మాట్లాడుతూ 2009 నుండి ప్రధానోపాధ్యాయుల సంఘంలో రాజగంగారెడ్డి , మోహన్‌తోపాటు జిల్లా సంఘం బలోపేతానికి కృషి చేస్తూ ప్రధానోపాధ్యాయుల సమస్యలు తీర్చడంలో చేసిన కృషిని గ్రహించి సేవలకు గుర్తింపుగా ఈ పదవికి ఎన్నుకున్నారన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన జిల్లా వాసి రాజగంగా రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ గౌడ్, ట్రెజరర్ తుకారం , జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో సంఘ బలపేతనికి, అభివృద్ధికి సంఘ ప్రధానోపాధ్యాయుల సమస్యలు తీర్చడంలో అందరితో కలిసి ముందుండి పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జూనియర్ బాలికల జట్టు



రాష్ట్రస్థాయిలో తలపడనున్న జూనియర్ బాలికల జట్టు

నవతెలంగాణ-ముప్కాల్

నేటినుండి ఈ నెల 25 వరకు జరిగే 50వ జూనియర్ అండర్-20 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్షిప్ టోర్నమెంట్‌కు నిజామాబాద్ జిల్లా కబడ్డీ జట్టు ఆదివారం బయలుదేరి వెళ్లిందని కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి తెలిపారు. హైదారబాద్‌లోని హకీంపేట్ క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని చెప్పారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను రెంజర్ల శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ నునుగొండ అంజయ్య, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్, కొమ్ముల నర్సయ్య, మునీరుద్దీన్, రిటైర్డ్ టీచర్ గోపీనాథ్, ఏలేటి గంగారెడ్డి, స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గద్దల గంగారం, కనకయ్య, దినేష్, రాము, పిడి రాజ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి

సంబురంగా సెయింట్ పాల్ హై స్కూల్ 34వ వార్షికోత్సవాలు



నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థులు చిన్ననాటి నుండి కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరాలని, పిల్లలను చదువుతోపాటు ఆట పాటలలో ముందుంచేందుకు పాఠశాల యాజమాన్యం కృషి చేయడం అభినందనీయమని ఫిలిం మేకర్, అప్కో ఫౌండేషన్ డైరెక్టర్ ఫేరల్‌ఘాట, తెలంగాణ యూనివర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ బాలకిషన్ అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి సెయింట్ పాల్ హై స్కూల్ 34వ వార్షికోత్సవ సంబరాలు శనివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. పలు కార్యక్రమాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థిని, విద్యార్థులను సత్కరించినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బబ్లు, ప్రిన్సిపాల్ కేథరిన్ పాల్, వైస్ ప్రిన్సిపాల్ సెసిలియా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయం

- పిఎస్‌ఎస్‌ఎమ్ జిల్లా అధ్యక్షులు సాయికృష్ణ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఈనెల 21 శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించడం హర్షనీయమని పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు సాయి కృష్ణ రెడ్డి ఆదివారం తెలిపారు. భారత ప్రాచీన సాంస్కృతిలో ఒకటిగా గుర్తింపు పొందిన ధ్యానంతో ఆరోగ్యం, ఆనందం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని, హైదరాబాదులో తొలి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించటం సంతోషంగా ఉందని అన్నారు.

బీమా చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలువురికి ఆదివారం సాయంత్రం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం రాజంపేట మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్ కు గురై మొకిరె ఎల్లయ్య మరణించగా ఆయన భార్య మంజులకు ప్రమాద బీమా చెక్కు 5 లక్షలు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు అందజేశారు. గాంధారి మండలం గండివేట్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో పెద్దాపురం రాజు మరణించగా వారి తల్లి కాషమ్మ కు ప్రమాద బీమా ఐదు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటానని, ప్రమాదాలు జరిగిన వెంటనే సమాచారం అందించాలని మృతుల కుటుంబాలకు భరోసిస్తానన్నారు. అనంతరం అన్నాసాగర్ లోని మాజీ ఎంపిటిసి శ్రీధర్ గౌడ్ మృతి చెందడంతో మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతి తీరని లోటు అన్నారు అండగా ఉంటానని కుటుంబానికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా మాజీ జెడ్పిటిసి గయాజుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకుల తదితరులు ఉన్నారు.

పెళ్ళి భారత్‌లో డిజే ఎదుట ఘర్షణ

- గాయాలతో ఇద్దరు ఆసుపత్రి పాలు
- కత్తిపోట్ల అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్న బాధితులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన పెళ్ళి భారత్‌లో డిజే వద్ద అనవసర విషయాలకు, పెళ్ళికి సంబంధం లేని వ్యక్తులు వెళ్లి ఘర్షణ పడ్డట్లు తెలిసింది. ఘర్షణలో రాకేష్ అనే యువకునికి కాలు విరుగగా, ఆరెళ్ల లక్ష్మణ్ అనే మరొ యువకుని నుదుటిపై గాయమై ఐదు కుట్లు పడ్డట్లు, వీరు ఇద్దరు జిల్లాకేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు, సంఘటన స్థలంలో మరో ఇద్దరికీ కొద్దిపాటి గాయాలు అయినట్లు తెలిసింది, బాధితులు గాయాలతో పోలీస్ స్టేషన్ కు వెళ్ళి, తమకు కొట్టిన నలుగురి పేర్లతో పాటు, మరికొందరిని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. పెళ్ళి ఒకరిదైతే అసలు వారికీ సంబంధం లేని వ్యక్తి డిజే వ్యక్తి తన మిత్రులకు ఆకారణంగా పిలిపించి గొడవ సృష్టించినట్లు తెలిసింది. ఇంతటి హంగామా సృష్టించిన ఆవ్యక్తులు కావాలని గొడవకు దిగి గాయపర్చారని, ఇంతటి గాయం కత్తి తో అయిందా..? మారేమైనా పదునైన ఆయుధమ! లేక బీరు సీసా పగులగొట్టి కొట్టారా అని బాధితులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అమాయకులైన బాధితులు ఆసుపత్రిలో ఇబ్బందులు పడుతుండగా గాయపరచినవారు తమపై కేసు కాకుండా, చిన్న కేసుతో సరిపెట్టే విధంగా చూసేందుకు నాయకులతో పోలీసులతో చర్చించుతున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతుంది. అయినప్పటికీ పోలీసులు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇందులో గ్రామానికి చెందిన ఓవర్గం వ్యక్తి, మీకేమి కాదు.. నేను ఉన్నకదా, కేసునుండి తప్పిస్తానని మాట ఇచ్చినట్లు తెలిసింది. ఏదేమైనప్పటికి పోలీసులు నిక్కచ్చిగా విచారించి బాధితులకు బాసటగా నిలుస్తారా.. సదరు బాధిత వర్గానికి చెందిన ఆపెద్ద మనిషికి బాసటగా నిలుస్తారా.. వేచి చూడాలి మరీ.



గాయపడ్డ ఆరెళ్ల లక్ష్మణ్